క్లుప్తంగా

సన్మానం

వాంకిడి: తుడుందెబ్బ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కోట్నాక విజయ్ కుమార్‌ను బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రెబ్బెన మండల అధ్యక్షుడు మాల్రాజు రాంబాబు మోకాసిగూడ (ఇందాని)లోని కోట్నాక విజయ్ కుమార్ నివాసంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కనర్‌గాం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విని యోగదారులు సహకరించాలని కోరారు.

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెంచికల్‌పేట్ విద్యుత్‌శాఖ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కెరమెరి: శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ కెరమెరి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా 3 గంటలు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవిందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ కోతలతో ఇబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వేసవి కావడంతో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు వేడిని తట్టుకోలేక పోతున్నారు. కరెంటు ఇబ్బందులు రావడంతో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంటు కష్టాలను దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యవర్గం ఎన్నిక


జగ్గయ్యను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్లోని సీఈఆర్ క్లబ్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. క్లబ్ సంయుక్త కార్యదర్శిగా భుక్య జగ్గయ్య, కోశాధికారిగా దిలీప్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కిరణ్‌బాబు, మారం శ్రీనివాస్, ఈఎస్ రాజు, బుర్ర శ్రీనివాస్, దేవేందర్, రారాజు, సంజీవ్, ఎస్‌కే అబ్బాస్, సలహాదారులుగా తిరుపతి, ప్రకాష్ రావు, మాల్రాజు శ్రీనివాస్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

సభకు తరలిరండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు, అధికసంఖ్యలో తరలి రావాలని మండల నాయకులు దుర్గం వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నెపల్లి గ్రామంలో సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈనెల 27న వరంగల్‌లో బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చారి గోవింద్ రావు, దుర్గం సందీప్, గంగారాం పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెజ్జూర్: బెజ్జూర్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏపీఎం మోహన్‌లాల్ శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బారెగూడ శ్రీ ఆంజనేయ గ్రామ సంఘం ఆధ్వర్యంలో యాసంగి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, పద్మ, శ్రీదేవి, విజయ్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేసేదెప్పుడో?

- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చీలపెల్లి కల్వర్టు (ఫైల్)

సిర్పూర్(టి): గత ఏడాది మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సిర్పూర్(టి)- చీలపెల్లి రోడ్డు కల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయాయి. మండలంలోని చీలపెల్లి, పూసిగూడ, లింబుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లితో పాటు కాగజ్‌నగర్ మండలంలోని చిన్నమాలిని, మాలిని ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రతీ రోజు మండల కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణానికి ప్రతీరోజు ప్రయాణం సాగిస్తుంటారు. భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టులు, రోడ్లకు ఇప్పటి వరకూ ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ప్రతీ ఏటా వర్షాకాలంలో రోడ్డు కోతకు గురవడం, కల్వర్టులు కోతకు గురవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఇదే రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో వరదనీరు చేరడంతో అండర్‌బ్రిడ్జి వాహనాల రాకపోకలు సైతం ఇబ్బందిగా మారుతుంది.

అత్యవసర సమయాల్లో..

మండల కేంద్రం నుంచి చీలపెల్లి గ్రామం మీదుగా వెళ్లే ప్రధాన రహదారి గుండా మండలంలోని చీలపెల్లి, పూసిగూడ, లింబుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లి గ్రామాలతో పాటు కాగజ్‌నగర్ మండలంలోని చిన్నమాలిని, మానిక్‌పటార్, మాలిని ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. సిర్పూర్(టి)–చీలపెల్లి గ్రామాల మధ్యలోని అటవీప్రాంతంలో ఉన్న రహదారి పూర్తిగా మట్టి రోడ్డు కావడం భారీ వర్షాలకు రెండు కల్వర్టులు, మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సైతం గ్రామాలకు వెళ్లేలేని పరిస్థితి నెలకొంది.

ఇబ్బంది పడుతున్నాం



సిర్పూర్(టి)– చీలపెల్లి మార్గమధ్య ప్రధాన రహదారిలో ప్రతీ సంవత్సరం భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడం, కల్వర్టులు కోతకు గురవడం జరుగుతుంటాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

– సుర్పం అర్జు, చీలపెల్లి మాజీ సర్పంచ్

అధికారులు స్పందించాలి



సిర్పూర్(టి)–చీలపెల్లి గ్రామాల మధ్యలో ఉన్న అటవీ ప్రాంతంలో ఉన్న రోడ్డుతో పాటు కల్వర్టుల వద్ద భారీ వర్షాలకు ప్రతీ ఏటా ప్రజలు రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రధాన రహదారి సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి.

– సత్యనారాయణ, చీలపెల్లి

ముందు అంత్యక్రియలు.. తర్వాత పోస్టుమార్టం


సంగీత (ఫైల్)


మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

లింగాపూర్: అంత్యక్రియలు జరిగి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసిన ఘటన మండలంలో సంచలనం సృష్టించింది. లింగాపూర్ మండలంలోని కీమానాయక్‌తండాకు చెందిన జెవురునాయక్ – పంచిబాయి దంపతుల కూతురు గుగులోతు సంగీత (16) ఆత్మహత్య చేసుకోగా గురువారం అంత్యక్రియలు సైతం నిర్వహించారు. అయితే ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని పోలీసులకు తెలుపకుండా, చట్టాలపై అవగాహన లోపంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న లింగాపూర్ ఎస్సై గంగన్న శుక్రవారం విచారణ చేపట్టారు. సంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని పూడ్చిపెట్టగా బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు.

తల్లి మందలించిందని..

గుగులోతు సంగీత అన్నం స్టవ్‌పై పెట్టి అలాగే మర్చిపోయి గ్రామంలోని దగ్గరి బంధువుల పెళ్లికి వెళ్లింది. సంగీత ఇంటికి తిరిగొచ్చిన తర్వాత తల్లి పంచిబాయి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సంగీత విషపదార్థం తీసుకుంది. తీవ్రంగా కడుపునొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఉట్నూర్, అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సంగీత గురువారం ఉదయం మృతి చెందింది.

కార్మిక కుటుంబాలకు నీటి సరఫరా చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్‌లో కొత్త పంపులను బిగించి కార్మిక కుటుంబాలకు తాగునీరు సరఫరా చేయాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సివిల్ ఎస్ఈ మదీనా భాషాకు వినతిపత్రం అందచేశారు. మాదారం టౌన్‌షిప్‌లో గత నాలుగు నెలలుగా మంచినీటి సరాఫరా సక్రమంగా కావడం లేదన్నారు. కార్మికులు విధులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి తాగేందుకు, స్నానాలు చేసేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు.గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, సేఫ్టీ అండ్ మైన్స్ కమిటీ, జీఎం కమిటీలలో మాట్లాడి కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఇలా చేయకుండా ఓడిపోయిన సంఘాల మాదిరి వినతిపత్రాలు చేస్తూ దొంగ ధర్నాలు చేయటం ఏంటని ప్రశ్నించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల చేతకానితనంతో మాదారం ఫిల్టర్ బెడ్‌లో పాత మోటార్లే రిపేరింగ్ చేసి పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మిక కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త మోటార్లు బిగించి నీటిని సరాఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజర్ ఇనూస్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

అఘోరీపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న అశోక్ మహోల్కర్

వాంకిడి: ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి చెందిన బీటెక్ విద్యార్థిని వర్షిణికి మాయ మాటలు చెప్పి, పెళ్లి చేసుకున్న అఘోరీపై చర్యలు తీసుకోవాలని గురువారం దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో మాట్లాడారు. ఆధ్యాత్మికత పేరుతో దేవుడి పేరు చెప్పుకుంటూ ఆడ పిల్లల జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, సమతా సైనిక్ దళ్ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి దుర్గం సందీప్, నాయకులు విజయ్ ఉప్రె, హంసరాజ్, విలాస్ ఖోబ్రగడే, ప్రతాప్, శివాజీ, చంద్రమని, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్‌లోని ఎఫ్‌సీఐ శుక్రవారం అగ్నిమాపక అధికారులు సిబ్బంది ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్త ల గురించి వివరించారు. ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ కుమార స్వామి, నరేశ్, సిబ్బంది రాజేష్, శివ కుమార్, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

గోలేటి డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోలేటి టౌన్‌షిప్‌లోని కార్మిక కుటుంబాల్లో పోగయ్యే చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకే చేరవేస్తుంటారు. శుక్రవారం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా డంపింగ్ యార్డులో ఉన్న చెత్తాచెదారానికి నిప్పు అంటుకుని భారీగా మంటలు ఎగిసిపడటంతో గమనించిన స్థానికులు పోలీసులతో పాటు ఆసిఫాబాద్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై చంద్రశేఖర్‌తో పాటు ఫైర్‌సిబ్బంది ఎగిసి పడుతున్న మంటలపై నీళ్లు చల్లి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా దట్టమైన పొగతో కూడిన మంటలు భారీగా ఎగిసి పడటంతో గోలేటిలోని కార్మిక కుటుంబాలు భయాందోళనకు గురయ్యాయి. రాత్రి 10 గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది మంటలను ఆదుపు చేస్తూనే ఉన్నారు.

పశు సంపద పెంచాలి


పశువుకు టీకా వేస్తున్న అంజలి

కౌటాల: పశు పోషకులు పశు సంపదను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముత్తంపేట పశువైద్యాధికారి అంజలి అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గురుడుపేట గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, శోభన్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కరెంట్ కష్టాలు..!

- వ్యవసాయానికి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్
- లో వోల్టేజ్‌తో కాలిపోతున్న విద్యుత్ మోటార్లు
- ఎండుతున్న పంటలు


ఎండిపోతున్న వరిపొలం

ఆసిఫాబాద్‌రూరల్: రైతులకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తూ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం అమలు చేయడం లేదు. మోతుగూడ గ్రామ రైతులకు కరెంట్ కష్టాలు వెంటాడుతున్నాయి. అన్ని ఉండి అల్లుడి నోట శని అనే విధంగా మారింది రైతుల పరిస్థితి. గ్రామంలో వ్యవసాయ మోటార్లకు ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లోవోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు ఇవి..

గ్రామానికి వ్యవసాయ పంటల సాగుకు ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో విద్యుత్ లోడు ఎక్కువై మోటార్లు కాలి పోతున్నాయి. గ్రామంలో సైతం కరెంట్ డిమ్‌గా ఉంటుంది.

- ట్రాన్స్‌ఫార్మర్ ముందు విద్యుత్ తీగలు లూజ్‌గా ఉండటంతో చిన్నపాటి గాలి వీచిన విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.
- కరెంట్ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోవడంతో రైతులు వర్షాకాలం పంటకే పరిమితమయ్యారు.

బీడుగా పొలాలు..



ఇక్కడ బీడుగా కనిపిస్తున్న స్థలంలో యాసంగి పంట వేయకుండా వదిలేశారు. మోతుగూడ గ్రామంలో బీమన్ కార్ పాలక్ రావు, బీమన్ కార్ కిరణ్, బీమన్, బోట్టుపల్లి పాలక్ రావు, తిరుపతి, జానకి రాం, వరి పొలాలు వర్షాకాలంలో సాగు చేసి యాసంగి పంట వేయకుండా 8 ఎకరాలు బీడుగానే వదిలేశారు. సాగుకు నీరు ఉండి కరెంట్ సమస్య ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. వ్యవసాయ మోటార్లకు కలిపి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో మోటార్లు కాలిపోతున్నాయి. గతంలో విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



గ్రామానికి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లోవోల్టేజ్‌తో ఏడాదిలో రెండుసార్లు మోటారు కాలిపోతుంది. దీంతో దిగుబడి కంటే పెట్టుబడి ఎక్కువై అప్పులు అవుతున్నాం. కరెంట్ అధికారులు సమస్యను గుర్తించి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. – బోట్టుపల్లి పాలక్‌రావు

ఆయిల్ ఇంజన్‌తో సాగునీరు



భీమన్ కార్ నాందేవ్, నగేశ్‌లు యాసంగిలో వరి పంట సాగు చేస్తున్నారు. 10 రోజుల నుంచి త్రీ ఫేజ్ కరెంట్ రావడం లేదు. వరి పొలాం నీరు లేక ఎండిపోతుంది. పొట్టదశలో పంట ఉండటంతో తప్పని పరిస్థితిల్లో అయిల్ ఇంజన్ పెట్టి వరికి సాగు నీరు అందిస్తున్నాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి. పంటను రక్షించుకునెందుకు రోజుకు రెండు వేలు ఖర్చు చేస్తున్నాం.

అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయండి

నార్నూర్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు అన్నారు. శుక్రవారం మండలంలోని భవానీగూడ గ్రామంలో చలో ఇంద్రవెల్లి కార్యక్రమంపై గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం ఎందరో మహనీయులు అమరులయ్యారని అన్నారు. ఆయన వెంట నాయకులు మధుకర్, జాలీంషావ్ పాల్గొన్నారు

ఘనంగా గుడ్ ఫ్రైడే


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆసిఫాబాద్‌అర్బన్: గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, జన్కాపూర్, రాజంపేట, సందీప్‌నగర్, టీఆర్‌నగర్ చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, పాస్టర్‌లు గుడ్ ఫ్రై డే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామంలో బుద్ధుని జయంతి పోస్టర్‌ను కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. మే 12న బుద్ధుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు వద్ద బుద్ధుడి విగ్రహం వద్ద జయంతి నిర్వహిస్తామన్నారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిలీప్, నవీన్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.